నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
3 | బుధవారం 7 మే 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

కూలిపోయిన బోరు వద్ద మహిళలు

తాగు నీటి గోస తీర్చాలి

- జిల్లెడలోని బీసీవాడలో మహిళల డిమాండ్
- కూలిపోయిన బోరు వద్ద ఆందోళన

వేమనపల్లి, మే 6 : బోరు కూలిపోయి తాగు నీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే అధికారులు స్పందించాలని జిల్లెడ గ్రామపంచాయతీలో బీసీ వాడ మహిళలు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం తమ వాడలో కూలిపోయిన బోరు వద్ద ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ గతేడాది వానకాలంలో బోరు కూలిపోయిందని, ఎన్ని సార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. సుమారు 30 కుటుంబాలు తాగు నీటి కోసం తిప్పలు పడాల్సి వస్తుందని, కిలోమీటరు దూరంలోనున్న వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి తాగు నీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ నీరు వారానికి రెండుసార్లే ఇస్తున్నారని, అవి కూడా కొంతమేరకే సరఫరా చేయడం వల్ల ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాడలో కొత్తగా బోరు వేయాలని కోరారు.

తేనెటీగల దాడి.. ఒకరి మృతి

పీ నర్సయ్య (ఫైల్)

రెబ్బెన, మే 6 : తేనెటీగల దాడిలో ఒకరు మృతి చెందగా, మరో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన ఆసిఫాబాద్ జిల్లాలో మంగళవారం జరిగింది. బెల్లంపల్లి ఏరియా గోలేటి-1 ఇంక్లైన్ గని దగ్గర గల ఫిల్టర్ బెడ్ ముందున్న ప్రహరీ ఇటీవల కూలిపోయింది. మంచిర్యాల జిల్లా తాండూర్ మండలం మదారంటౌన్‌షిప్‌లో నివాసముంటున్న తాపీ మేస్త్రి పుప్పాల నర్సయ్య (58) కూలీలైన మైలారపు శ్రీనివాస్, దుర్గారావు, కంట్రాక్టర్ ముత్యాల పైడిదర్‌తో కలిసి అక్కడికి వెళ్లాడు. ప్రహరీ నిర్మిస్తున్న క్రమంలో ఓ చెట్టుపై ఉన్న తేనెతుట్టె కదిలింది. ఒక్కసారిగా తేనెటీగలు దాడి చేయడంతో నర్సయ్యకు తీవ్రగాయాలయ్యాయి. బెల్లంపల్లి ఏరియా హాస్పిటల్‌కు తరలిస్తుండగా, మార్గంమధ్యలో మృతి చెందాడు. గాయపడిన నర్సయ్య, శ్రీనివాస్, దుర్గారావులకు గోలేటిలోని సింగరేణి డిస్పెన్సరీలో ప్రథమ చికిత్స అందించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రెబ్బెన ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. యూనియన్ నాయకులు, ఏరియా అధికారులు నర్సయ్య కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

మంచిర్యాలలోని మెప్మా కార్యాలయం పై అంతస్తు

మెప్మాలో అవినీతి

రూ. రెండు కోట్ల స్త్రీనిధి సొమ్మును సొంతానికి వాడుకున్న ఆర్పీలు

- తిరిగి చెల్లించడానికి గడువు ఇచ్చినా స్పందించని వైనం
- చర్యలకు సిఫారసు చేసిన కమిషనర్

మంచిర్యాలటౌన్, మే 6 : పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లో అవినీతి జడలు విప్పింది. మహిళా సంఘాల సభ్యులు తీసుకున్న స్త్రీనిధి రుణాలకు సంబంధించి బ్యాంకులకు చెల్లించాల్సిన కిస్తీ డబ్బులను రిసోర్స్ పర్సన్స్ (ఆర్పీ) వసూలు చేసి తమ సొంతానికి వాడుకోవడం చర్చనీయాంశమవుతున్నది. మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలోని మంచిర్యాల పట్టణ సమాఖ్య కిందకు వచ్చే ఏడు స్లమ్‌లెవెల్ ఫెడరేషన్‌లు, నస్పూరు మున్సిపాలిటీ పట్టణ సమాఖ్య పరిధిలోని మూడు స్లమ్‌లెవెల్ ఫెడరేషన్‌లు కలిపి మొత్తం 10 ఎస్ఎల్ఎఫ్‌ల పరిధిలో దాదాపు రూ. రెండు కోట్లకు పైగా డబ్బులను ఆర్పీలు బ్యాంకులకు చెల్లించకుండా తమ సొంతానికి వాడుకున్నట్లు ఆడిట్‌లో వెల్లడైంది. వసూలు చేసిన రుణాల సొమ్మును ఎప్పటికప్పుడు బ్యాంకుల్లో చెల్లించేలా చూడాల్సిన సీవోలు, టీఎంసీలు చూసీచూడనట్లుగా వ్యవహరించడం అనుమానాలకు తావిస్తున్నది. ఈ ఏడాది జనవరిలో జరిగిన ఆడిట్‌లో స్త్రీనిధి రుణాలు తీసుకున్న సభ్యుల దగ్గర తిరిగి చెల్లించడం కోసం వసూలు చేసిన సొమ్మును బ్యాంకులకు చెల్లించలేదని తేటతెల్లమైంది. 10 టీఎల్ఎఫ్‌ల పరిధిలో రూ. ఐదేసి లక్షలకు పైబడి వాడుకున్న వారి జాబితాను తయారు చేశారు. ఇంతకన్నా తక్కువగా ఉన్న ఆర్పీలు కూడా మరికొందరు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. మొత్తంగా వసూలు చేసిన రుణాలను ఆర్పీలు తమ ఇష్టారాజ్యంగా సొంత అవసరాలకోసం వాడుకోవడం చర్చనీయాంశంగా మారింది. అయితే, ఆడిట్ నివేదిక వచ్చాక సంబంధిత ఆర్పీలను పిలిపించి వాడుకున్న సొమ్మును చెల్లించాలని గడువు ఇచ్చినా ప్రయోజనం లేకపోవడంతో వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్‌కు మంచిర్యాల కమిషనర్ లేఖ రాశారు. స్త్రీనిధి రుణాలు తీసుకున్న మహిళా సంఘాల సభ్యుల నుంచి వసూలు చేసి సొంతానికి వాడుకున్న వారిలో మంచిర్యాల పట్టణ సమాఖ్యకు చెందిన జాగృతి స్లమ్‌లెవెల్ ఫెడరేషన్‌లో రూ.10 లక్షలు, జాజిమల్లి ఎస్ఎల్ఎఫ్‌లో రూ. 9.60 లక్షలు, లక్ష్మీప్రసన్న ఫెడరేషన్‌లో రూ. 8.73 లక్షలు. లక్ష్మీశాంతి ఫెడరేషన్‌లో రూ. 10.53 లక్షలు, ప్రగతిశీల ఫెడరేషన్‌లో రూ. 6.64 లక్షలు, శ్రీలక్ష్మీదేవి ఫెడరేషన్‌లో రూ. 8.24 లక్షలు. శ్రీమంజునాథ ఫెడరేషన్‌లో రూ. 8.79 లక్షలు, నస్పూరు పట్టణ సమాఖ్య పరిధిలోని గంగోత్రి ఫెడరేషన్‌లో రూ. 27.64 లక్షలు, జనని ఫెడరేషన్‌లో రూ. 10.26 లక్షలు, వనిత ఫెడరేషన్‌లో రూ. 18.47 లక్షలతో మరిన్ని డబ్బులు బ్యాంకుల్లో చెల్లింపులు కానట్లు గుర్తించారు. వీరిపై తగిన శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని కమిషనర్ మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్‌కు లేఖరాశారు. వీటితోపాటు జిల్లాలోని పలు మున్సిపాలిటీల్లో కూడా స్త్రీనిధిరుణాల సొమ్మును బ్యాంకుల్లో జమ చేయకుండా ఆర్పీలు తమ సొంతానికి వాడుకున్నట్లు ప్రచారం జరుగుతోంది.

వాడుకున్న సొమ్మును చెల్లించడం కోసం ఇటీవల ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న ఆర్పీలు (ఫైల్)

- ఈ నెల 9న ప్రారంభించనున్న ఏసీబీ డైరెక్టర్ తరుణ్‌జోషి
- మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల కేసుల పర్యవేక్షణ
- అవినీతి అధికారుల్లో మొదలైన గుబులు

ఇతర మండల నాయకులు స్టేజీపై ఉండడాన్ని ప్రశ్నిస్తున్న ప్రేమ్‌సాగర్‌రావు వర్గీయులు

కాంగ్రెస్‌లో వర్గవిభేదాలు

- వినోద్, పీఎస్సార్ వర్గీయుల మధ్య వాదోపవాదాలు
- రసాభాసగా కాంగ్రెస్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశం

కాసిపేట, మే 6 : కాసిపేట మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం రసాభాసగా మారింది. తెలంగాణ కో ఆపరేటీవ్ ఆయిల్ సీడ్స్, గోవర్ ఫెడరేషన్ చైర్మన్, కాంగ్రెస్ పరిశీలకుడు జంగా రాఘవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కాగా, ఆయన ముందే బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, మంచిర్యాల ఎమ్మెల్యే పీఎస్సార్ వర్గీయులు వాదోపవాదాలు చేసుకున్నారు. సభా వేదికపై స్థానిక మండల నాయకులను పిలవకుండా ఇతర మండలానికి చెందిన వారిని కూర్చోబెట్టడం ఏమిటని ప్రేమ్‌సాగర్ రావు వర్గం నాయకులు నిలదీశారు. దీంతో కొంత మంది స్టేజీపై ఉన్న నాయకులు కిందకు దిగారు. ఆపై పరిశీలకులు అందరినీ స్టేజీపైకి పిలువగా, అక్కడ ఎవరికి వారు తమ బలాన్ని ప్రదర్శించినట్లుగా కనిపించింది. ఇక ఇదిలా ఉండగా రెండు వర్గాల నాయకులు పరిశీలకుడు జంగా రాఘవరెడ్డిని కలిసి ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకున్నట్లు సమాచారం. 2017కు ముందు నుంచి కాంగ్రెస్‌లో ఉన్న వాళ్లకే అవకాశాలు కల్పిస్తామని, గ్రామ స్థాయిలో పర్యవేక్షణ చేసి కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు తగిన న్యాయం చేస్తామని ఇన్‌చార్జి జంగా రాఘవరెడ్డి తెలిపారు. కాగా, ప్రస్తుతం కాసిపేట మండలంలో బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వర్గం, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు వర్గం ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా వ్యవహరిస్తున్నారు.

స్టేజీపైనున్న నాయకులను ప్రశ్నిస్తున్న పీఎస్సార్ వర్గీయులు

సీసీసీలో ప్రారంభానికి ముస్తాబైన అవినీతి నిరోధక శాఖ కార్యాలయం

ఏసీబీ ఆఫీస్ సిద్ధం

సీసీసీలోని పాత సీఐ కార్యాలయంలో ఏర్పాటు

సీసీసీ నస్పూర్, మే 6: మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని సీసీసీ నస్పూర్‌లో ఏర్పాటు చేసిన ఏసీబీ కార్యాలయం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. ఈ నెల 9న ఏసీబీ డైరెక్టర్ తరుణ్ జోషి ప్రారంభించనుండగా, సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేస్తున్నది. సీసీసీ నస్పూర్ పాత పోలీస్ స్టేషన్ పక్కన ఉండే మంచిర్యాల రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం(ఓల్డ్)లో ఏర్పాటు చేస్తున్న ఈ కార్యాలయంలో 14 మంది ఉద్యోగులు పనిచేస్తారు. ఇక్కడ ఏసీబీ సేవలు అందుబాటులోకి వస్తే మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలకు సంబంధించిన ఫిర్యాదుదారులకు దూరభారం తగ్గనున్నది.

రెండు జిల్లాలకు అందుబాటులో సేవలు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సంబంధించి ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో అవినీతి నిరోధక శాఖ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఏసీబీని ఆశ్రయించాలంటే మంచిర్యాల జిల్లా వారు దాదాపు 160 కిలోమీటర్లు వ్యయప్రయాసాలకోర్చి ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది. అక్కడి నుంచే నిర్మల్, మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్ జిల్లాలకు ఏసీబీ సేవలు అందాయి. కొంత మంది దూరభారం వల్ల ఫిర్యాదులు చేయడానికి వెళ్లలేకపోయారు. వచ్చిన ఫిర్యాదులపై దర్యాప్తు చేయడానికి ఇటు ఏసీబీ అధికారులకు సైతం ఇబ్బందులు పడేవారు. ఇక ప్రస్తుతం కొత్త కార్యాలయం ప్రారంభోత్సవంతో ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలకు ఏసీబీ సేవలు అందనున్నాయి. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఏసీబీ ఆఫీస్ నుంచి నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలకు సేవలు అందిస్తారు. ఈ రెండు ఏసీబీ కార్యాలయాలు ఒకే డీఎస్పీ పర్యవేక్షణలో కొనసాగనున్నాయి.

అవినీతి అధికారుల్లో గుబులు

ఏసీబీ కార్యాలయం ఏర్పాటుతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తుండగా, అవినీతి అధికారుల గుండెల్లో మాత్రం రైళ్లు పరిగెడుతున్నాయి. వేగంగా అభివృద్ధి చెందుతున్న మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో రియల్ ఎస్టేట్, భూముల క్రయవిక్రయాలు, ధాన్యం దందా, ప్రభుత్వ అభివృద్ధి పనులు, తదితర వ్యవహారాల్లో అవినీతి ఎక్కువగానే జరుగుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో రెండు జిల్లాల నుంచి అవినీతి అధికారులపై ఫిర్యాదులు పెరిగే అవకాశమున్నది.

నేరుగా ఫిర్యాదు చేయవచ్చు..

ఈ నెల 9న ఏసీబీ కార్యాలయాన్ని ఏసీబీ డైరెక్టర్ తరుణ్ జోషి ప్రారంభిస్తారు. ఇక్కడ ఏసీబీ ఆఫీస్ ప్రారంభిస్తే మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల ప్రజలకు సేవలు అందుబాటులోకి వస్తాయి. ప్రభుత్వ అధికారులు లంచం డిమాండ్ చేస్తే బాధితులు నేరుగా ఏసీబీ ఆఫీస్‌కు వచ్చి ఫిర్యాదు చేయవచ్చు. ఏసీబీ టోల్‌ఫ్రీ నం. 1064, మొబైల్ నం. 9154388963లలో సంప్రదించవచ్చు.

- విజయ్‌కుమార్, ఏసీబీ డీఎస్పీ

సిర్పూర్ గడ్డపై గులాబీ జెండా ఎగరడం ఖాయం

పార్టీని వీడిన వారికి ప్రజలే బుద్ధి చెబుతారు

- మోసపూరిత కాంగ్రెస్ గద్దె దిగిపోవాలి
- ఇందిరమ్మ కమిటీల తీరుతో అర్హులకు అన్యాయం
- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్
- బీఆర్ఎస్ రజతోత్సవ సభ విజయవంతంపై అభినందన సభ
- సమస్యలపై ఇదే ఉత్సాహంతో పోరాడాలని శ్రేణులకు పిలుపు

అభినందన సభలో శ్రేణులను సన్మానిస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

కాగజ్‌నగర్, మే 6 : రాబోయే ఎన్నికల్లో సిర్పూర్, తెలంగాణ గడ్డ మీద బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ స్పష్టం చేశారు. ఇటీవల నిర్వహించిన రజతోత్సవ సభను విజయవంతం చేసిన సందర్భంగా మంగళవారం కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలో అభినందన సభ నిర్వహించారు. నియోజకవర్గ నాయకులు, మండల కన్వీనర్లు, పట్టణ ముఖ్య నాయకులు, యూత్, సోషల్ మీడియా ఇన్‌చార్జిలను ఆయన ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిర్పూర్ నియోజకవర్గం ఇప్పటికే ఆగమైందని, స్థానిక రైతులు, ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారని, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు ఏదీ పట్టించుకోవడం లేదన్నారు. వడగండ్ల వర్షాలతో పంటలు నష్టపోతే ఫసల్ బీమా యోజన పథకం కింద సాయం చేస్తామన్న హామీని విస్మరించారని మండిపడ్డారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ఇప్పటి వరకు సిర్పూర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి పూర్తి చేయలేదన్నారు. నియోజకవర్గంలో ఒక్క లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కూడా పనిచేయడం లేదని, అందెవెల్లి బ్రిడ్జి మీదుగా బస్సు వెళ్లేటప్పుడు ప్రయాణికులు భయంతో వణికిపోతున్నారని చెప్పారు. ఇప్పటి వరకు బీఆర్ఎస్ పార్టీలో ఉన్న నాయకులు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలుగా పనిచేసిన వారు అధికారం కోల్పోయిన వెంటనే పార్టీని వీడారని, అలాంటి వారికి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. వారంతా అమాయక ప్రజలను బెదిరించి ఇక్కడి వనరులను దోచుకొని ఆంధ్రా ప్రాంతానికి తరలించారని, వారి భరతం పడుతామని హెచ్చరించారు. మోస పూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు చేతులెత్తేసిందని, పరిపాలన చేతగాని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పి గద్దెదిగాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం వేసిన కమిటీలు కేవలం కాంగ్రెస్ కార్యకర్తల కోసమే పనిచేస్తున్నాయని, అర్హులైన పేదలకు అన్యాయం జరుగుతుందని మండిపడ్డారు. అంతేగాకుండా రాజీవ్ యువ వికాసం పథకంలో రాష్ట్ర వ్యాప్తంగా 16 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారని, అకస్మాత్తుగా ప్రభుత్వం లబ్ధిదారులకు సిబిల్ స్కోర్ ఉండాలని షరతులు పెట్టడం అన్యాయమన్నారు. నోటిఫికేషన్ ఇచ్చినప్పుడే సిబిల్ ఉండాలని ఎందుకు చెప్పలేదని సర్కారును నిలదీశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని నడుపుతున్నారా...? లేక ఫైనాన్స్ కంపెనీని నడుపుతున్నారా...? అని ప్రశ్నించారు. అందుకే రేవంత్ రెడ్డి గద్దె దిగిపోవాలని, తిరిగి కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుంటామన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు ఇదే ఉత్సాహంతో నియోజకవర్గ సమస్యలపై నిరంతరం పోరాటం చేయాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ, ప్రజలను చైతన్యవంతం చేయాలని, తెలంగాణ ప్రజల ప్రయోజనాలను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం కన్వీనర్ లెండుగురే శ్యాంరావు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈ భవనాలపై పట్టింపేది?

నిరుపయోగంగా మండల విద్యావనరుల కేంద్ర భవనం

హాజీపూర్, మే 6 : రాపల్లి గ్రామంలో నిర్మించిన మండల విద్యావనరుల కేంద్రం, మహిళా భవనం ప్రారంభోత్సవాలకు నోచుకోక నిరుపయోగంగా మారాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు రూ. 41 లక్షలతో మండల విద్యావనరుల కేంద్ర భవనం, రూ. 10 లక్షలతో మహిళా భవనాన్ని నిర్మింపజేశారు. ఇంతలోనే ఎన్నికల కోడ్ రావడంతో వాటిని ప్రారంభించలేదు. ఈ క్రమంలో కాంగ్రెస్ విజయం సాధించి. ఆ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర పూర్తయినా ఆ భవనాలను పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి వాటిని ప్రారంభించి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

నిరుపయోగంగా మహిళా భవనం